సాక్షి శ్రీకాకుళం

బుధవారం ∣ 28 ∣ జూన్ ∣ 2023



స్టోర్స్‌లో ఇంటి దొంగలు

విద్యుత్ స్టోర్స్‌లో ఇంటి దొంగలు ఉన్నారు. విజిలెన్స్ అధికారులు రంగంలోకి దిగారు.

- IIలో



డిగ్రీ, బీఈడీ నాలుగేళ్లలోనే..

సమీకృత ఉపాధ్యాయ కోర్సులు ప్రారంభమవుతున్నాయి. దరఖాస్తులు కూడా ఆహ్వానిస్తున్నారు.

- IIలో

శ్రీకాకుళం జిల్లా ఉష్ణోగ్రతలు

మండలం	గరిష్ఠం	కనిష్ఠం
ఆమదాలవలస	32°	27°
ఇచ్ఛాపురం	32°	27°
పాతపట్నం	33°	27°
శ్రీకాకుళం	31°	26°

న్యూస్‌రీల్

29న బక్రీద్

శ్రీకాకుళం కల్చరల్: ఈనెల 29న బక్రీద్ పండుగ సందర్భంగా శ్రీకాకుళం జీటీ రోడ్డులో ఉన్న జామియా మసీదులో ఉదయం 8.30గంటలకు నమాజు జరుగుతుందని జామియా మసీదు మేనేజ్‌మెంట్ కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. జిల్లా, పట్టణంలో ఉన్న ముస్లిం సోదరులందరూ ఒక అరగంట ముందుగా అంటే 8గంటలకు జామియా మసీదుకు చేరుకొని సామూహిక నమాజ్‌లో పాల్గొనాలని కోరారు.

మధుకేశ్వరుని హుండీ ఆదాయం రూ.2.86 లక్షలు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది, అర్చకులు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగం దేవాలయం హుండీ ఆదాయం రూ.2,86,333 వచ్చినట్లు ఆలయ ఈఓ పి.ప్రభాకరరావు తెలిపారు. ఆలయ సిబ్బంది, అర్చకుల సమక్షంలో మంగళవారం గత మూడు నెలల హుండీ ఆదాయాన్ని లెక్కించినట్లు వివరించారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ పర్యవేక్షకులు వెంకటరమణ, కొమనాపల్లి సత్యసాయి సేవా భజన మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌గా నక్క యుగంధర్



నక్క యుగంధర్

శ్రీకాకుళం క్రైమ్ : శ్రీకాకుళం నూతన డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌గా నక్క యుగంధర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఇక్కడ పనిచేసిన కూన కళ్యాణి బదిలీపై విశాఖపట్నం విజిలెన్సు అండ్ ఇంటిలిజెన్సు డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌గా (నర్సీపట్నం, గాజువాక పరిధి) వెళ్లారు. యుగంధర్ ఇదివరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాద్‌లో రెండున్నరేళ్లు, విభజన తర్వాత విజయనగరంలో నాలుగేళ్లు, చివరిసారిగా నర్సీపట్నంలో చేసి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈయన స్వస్థలం ఎచ్చెర్ల గ్రా మం. టెక్కలి డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌గా రెగ్యులర్ పోస్టుపై ఉండి శ్రీకాకుళం జిల్లా బాధ్యతలు చూసుకుంటారు.

ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలోని అంబేడ్కర్ గురుకులంలో ఖాళీగా ఉన్న ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ సంస్థ జిల్లా కన్వీనర్ ఎన్.బాలాజీ నాయక్ తెలిపారు. నందిగాం బాలుర గురుకులంలో ఎంఈసీ, సీఈసీ మిగులు సీట్లకు అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 6281905023, 9177788124, 08942 279926, 9652290407 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

'సహకార రంగ బలోపేతానికి కృషి'



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: సహకార రంగ బలోపేతానికి కృషి చేయాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా సహకార అభివృద్ధి కమిటీ తొలి సమావేశం కలెక్టర్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ సహకార సంఘాల బలోపేతానికి తగిన ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. సంఘాల ఆదాయం పెంచేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. కొత్త సంఘాలు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలోని అన్ని సహకార సంఘాలు జాతీయ సహకార డేటా బేస్‌లో వారం రోజుల్లోగా వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. జిల్లాలోని 572 సహకార సంఘాల్లో 388 సహకార సంఘాలను జాతీయ సహకార డేటా బేస్‌లో నమోదు చేశారని, మిగిలిన 184 సహకార సంఘాలను త్వరితగతిన నమోదు చేయాలని ఆదేశించారు. జిల్లా సహకార అధికారి ఎస్.సుబ్బారావు మాట్లాడుతూ సహకార సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు వివరించారు.

రథాలు పోయినా పెగలని నోళ్లు
ఇప్పుడు రాయితీపై గగ్గోలు



టీడీపీ హయాంలో రైతురథం పేరిట దోపిడీ

- 22 ట్రాక్టర్ల డబ్బులు కొట్టేసిన నాయకులు
- ఒక్క అక్షరమైనా రాయని 'ఈనాడు'
- వైఎస్సార్ యంత్ర సేవా పథకంపై విషం చిమ్ముతున్న వైనం
- సాంకేతిక కారణాలను పెద్దవి చేస్తూ వివపు రాతలు
- ప్రజలను తప్పుదోవ పట్టించేలా కథనాలు



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: రైతు రథం.. పథకం పేరు గుర్తుందా..? రైతుల పేరు చెప్పి టీడీపీ నాయకులు డబ్బులు దోచుకోవడానికి వేసిన పథకమిది. ఆ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో జిల్లాలో 24 మందికి ట్రాక్టర్లను ఇచ్చినట్లు ప్రచారం చేశారు. ఆ మేరకు పచ్చ పత్రికలు తమ శక్తి కొద్దీ డప్పు కొట్టాయి. కానీ క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే రెండంటే రెండే ట్రాక్టర్లు కనిపించాయి. మిగతా వాటి జాడే లేదు. రికార్డుల్లో ట్రాక్టర్లు ఇచ్చినట్టు చూపించి, వాటి కింద వచ్చే సబ్సిడీ మొత్తాన్ని మింగేశారు. ఒక్కో ట్రాక్టర్‌పై రూ.లక్షా 50వేల వరకు సబ్సిడీ ఇస్తే దాన్ని టీడీపీ నేతలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు స్వాహా చేశారు. ఈ ఒక్క ట్రాక్టర్ల స్కామ్‌లోనే దాదాపు రూ.33లక్షల సొమ్ము భోంచేశారు. ఇదంతా 2018 డిసెంబర్, 2019 ఫిబ్రవరి, మార్చి నెలలో జరిగింది. నాడు కళ్ల ఎదురుగా ఇంత అక్రమం జరిగినా ఈనాడు పత్రిక అక్షరం ముక్కయినా రాయలేదు.

చంద్రబాబు హయాంలో కళ్లకు గంతలు కట్టుకున్న కలాలు ఇప్పుడు మాత్రం అకస్మాత్తుగా భూతద్దాలు పెట్టుకుని మరీ తప్పులు వెతుకుతున్నాయి. వైఎస్సార్ యంత్ర సేవా పథకం కింద గ్రూపుగా ఏర్పడిన రైతు సంఘాలకు వైఎస్ జగన్ ప్రభుత్వం సబ్సిడీతో ట్రాక్టర్లు, ఇంప్లిమెంట్స్, హార్వెస్టర్లను సమకూర్చింది. బహిరంగంగా, విశాలమైన మైదానంలో, లబ్ధిదారులకు ఈ వాహనాలను ఈ నెల 2న అందజేశారు. ఇందులో ఎలాంటి మతలబు లేదు. వాహనం, లబ్ధిదారుడి వివరాలు ప్రపంచానికి చెప్పి మరీ ట్రాక్టర్లు, యంత్రాలను పంపిణీ చేశారు. దీనికి సంబంధించిన రాయితీ డబ్బులు రాష్ట్రమంతా పడ్డాయి. మన జిల్లాలోనూ చాలా మంది రైతులకు రాయితీ సొమ్ము ఖాతాలకు జమ చేశారు. అయితే కొందరు రైతులకు మాత్రం సాంకేతిక కారణాలతో రాయితీ సొమ్ము పడలేదు. వాహనాలను పంపిణీ చేసి 25 రోజులు మాత్రమే అయ్యింది. సాంకేతిక సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. ఆ లోగానే ఈనాడు పత్రిక తనకు అలవాటైన రీతిలో విషం కక్కడం మొదలుపెట్టింది. రైతులను మభ్య పెట్టేలా రాయితీ సొమ్ము అందడం లేదని గగ్గోలు పెట్టింది. ఎన్నికల ఏడాది నేపథ్యంలో కల్లబొల్లి కబుర్లు చెబుతూ జనాలను తప్పుదోవ పట్టిస్తోంది.

వైఎస్సార్ యంత్ర సేవా పథకం ఇలా..

జిల్లాలోని 8 నియోజకవర్గాల పరిధిలోని 30 మండలాలకు వైఎస్సార్ యంత్ర సేవా పథకం కింద రెండు విడతల్లో 631ట్రాక్టర్లు, ఇంప్లిమెంట్స్, 57 హార్వెస్టర్లు పంపిణీ చేసింది.

వీటికోసం ప్రభుత్వం రూ.75.45 కోట్ల మేర ఖర్చు చేసింది. ఇందులో సబ్సిడీ రూ.26.18కోట్లు.



రైతు రామయ్య అకౌంట్‌లో జమ అయిన రాయితీ సొమ్ము రూ. 2,13,200

త్వరగా వచ్చేలా..

రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలకు ట్రాక్టర్లకు సంబంధించిన రాయితీ అందింది. మన జిల్లాలో కొందరికి సాంకేతిక సమస్యతో జమ కాలేదు. ఆ రాయితీ త్వరగా వచ్చేలా సాంకేతిక సమస్యను సరిదిద్దే కార్యక్రమం చేపట్టాం. త్వరలోనే రైతులకు రాయితీ అందనుంది. ఇందులో ప్రత్యేకించి ప్రభుత్వ తప్పిదం లేదు.

– శ్రీధర్, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్.

నాకు డబ్బులు పడ్డాయి..



వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి రైతు సంక్షేమానికి కృషి చేస్తున్న నాయకుడు. నేను వైఎస్సార్ యంత్ర సేవా పథకం ద్వారా ట్రాక్టర్ తీసుకున్నాను. దీంతో పాటుగా దుక్కి యంత్రాలు కూడా ప్రభుత్వం రాయితీలపై అందించింది. రాయితీ సొమ్ము ఈ నెల 2న రూ.2,13,200 నా బ్యాంక్ ఖాతాలో జమ అయ్యింది. చాలా సంతోషంగా ఉంది. సీఎం వైఎస్ జగన్ నిజంగా రైతు పక్షపాతి. ఆయనకు రుణపడి ఉంటాం.

– తమ్మినాన రామయ్య, ట్రాక్టర్ లబ్ధిదారుడు, సీతాపురం, వజ్రపుకొత్తూరు మండలం.



ఇటీవల కోడి రామ్మూర్తి స్టేడియంలో పంపిణీ చేసిన ట్రాక్టర్లు, ఇంప్లిమెంట్స్ (ఫైల్)

పేదింటి విద్యార్థినికి చేయూత



మీనాకుమారికి దాతలు ఇచ్చిన నగదును అందజేస్తున్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, కృపారాణి, తిలక్, వాణి తదితరులు

టెక్కలి: టెక్కలి మండలం మోదుగువలస గ్రామానికి చెందిన కొర్లాపు మీనాకుమారి అనే విద్యార్థిని పైచదువులకు సాయం అందుతోంది. ఆమెకు టెక్కలిలో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్, వైఎస్సార్ సీపీ నాయకురాలు దువ్వాడ వాణి చేతుల మీదుగా మంగళవారం నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. మీనాకుమారి ఇంటర్ ఫలితాల్లో 981 మార్కులు సాధించి స్టేట్ టాపర్‌గా నిలిచింది. ఇటీవలే సీఎం వైఎస్ జగన్ కూడా ఆమెను సత్కరించారు. అయితే విద్యార్థిని నీట్ శిక్షణ, వైద్య విద్య అభ్యసించడం కోసం మోదుగువలస గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు మోదుగువలస గణపతిరావు కుమార్తె ప్రసూతి వైద్యురాలు స్వర్ణలత, కుమారుడు రాజేష్ (యూఎస్ఏ)లు తమ వంతు సాయంగా రూ.లక్ష సాయం అందజేశారు. ఈ నగదును నాయకుల చేతులమీదుగా విద్యార్థినికి అందించారు.

అనంతరం విద్యార్థినిని సన్మానించారు. అలాగే కళాశాలకు చెందిన ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జనార్దనరావుతో పాటు బైపీసీ విభాగం అధ్యాపకుడిని సత్కరించారు. కార్యక్రమంలో మోదుగువలస గ్రామానికి చెందిన పెద్దలు ఎం. దుర్యోధనరావు, రమాదేవితో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు డాక్టర్ కె.రామ్మోహన్‌రావు, సర్పంచ్ జి.సుజాత, నందిగాం ఎంపీపీ ఎన్.శ్రీరామ్మూర్తి, ఎస్.ఉషారాణి, పి.హేమలత, సత్తారు సత్యం, టి.కిరణ్, వి.శ్రీధర్‌రెడ్డి, ధవళ కృష్ణ, బి.శ్రీనివాస్, బి.విశ్వనాథం, బి.లక్ష్మీపతి, కె.అజయ్, పి.మాధవరావు, బి.కార్తీక్, బి.తులసీరావు, బి.రాజేష్, ఎంఈఓ డి.చిన్నారావు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్తగా దువ్వాడ వాణి



టెక్కలి: ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్తగా దువ్వాడ వాణిని నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం మంగళవారం ప్రకటించింది. ఈ మేరకు నియోజకవర్గంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ కేడర్‌లో గల వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలంతా దువ్వాడ వాణి నియామకంపై హర్షం వ్యక్తం చేశారు. 2001లో కాంగ్రెస్ పార్టీ తరఫున దువ్వాడ వాణి టెక్కలి జెడ్పీటీసీగా గెలుపొందారు. 2004లో డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో హరిశ్చంద్రాపురం నియోజకవర్గానికి కాంగ్రెస్ పార్టీ తరఫున ఎమ్మెల్యేగా పోటీ చేశారు. అనంతరం 2005 నుంచి కొంత కాలం గా పీసీసీ మెంబర్‌గా సేవలు అందజేశారు. 2021లో వైఎస్సార్‌సీపీ తరఫున టెక్కలి జెడ్పీటీసీగా 22,732 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.

'ఆర్టీసీ స్థలాలు ఇస్తాం'

శ్రీకాకుళం అర్బన్: జిల్లాలోని పలు ఆర్టీసీ బస్టాండ్‌లలోగల ఖాళీ స్థలాలను లీజు ప్రాతిపదికన ఇస్తామని ఆర్టీసీ డీపీటీఓ ఎ.విజయకుమార్ అన్నారు. శ్రీకాకుళంలోని ఆర్టీసీ డీపీటీఓ కార్యాలయంలో మంగళవారం ఔత్సాహిక వ్యాపారవేత్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లాలో గల ఇచ్ఛాపురం, సోంపేట, ఆమదాలవలస, టెక్కలి తదితర బస్టాండ్‌లలోని 5 ఖాళీ స్థలాలను ఓఎస్ 15 స్కీమ్‌లో 15 ఏళ్లకు లీజు ప్రాతిపదికన ఇవ్వడానికి ఆర్టీసీ నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. ఔత్సాహిక వ్యాపారవేత్తలు ఈ స్థలాల కోసం టెండర్‌లు దాఖలు చేసుకుని ఆయా స్థలాలను అభివృద్ధి చేసి లాభపడాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ సీటీఎం ఎం అండ్ సి అప్పలనాయుడు, ఆర్టీసీ డీఈ బమ్మిడి రవికుమార్, జిల్లాకు సంబంధించిన ఔత్సాహిక వ్యాపారవేత్తలు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణులకు అండగా ఉంటాం



నాయీ బ్రాహ్మణ గర్జనలో మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

- రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): సమస్యలు చెప్పుకోవడానికి వెళ్లిన నాయీ బ్రాహ్మణులను ఉద్దేశించి 'తోకలు కత్తిరిస్తా..తోలు తీస్తా' అని వ్యాఖ్యానించిన చంద్రబాబును ఎవరూ సమర్థించరని రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. నాయీ బ్రాహ్మణులకు తమ ప్రభుత్వం ఎల్లవేళలా అండగా ఉంటుందని అన్నారు. ఆ కోవలోనే రాజ్యసభకు నలుగురు బీసీలను పంపించారని గుర్తు చేశారు. శ్రీకాకుళంలోని అంబేడ్కర్ ఆడిటోరియంలో మంగళవారం నాయీ బ్రాహ్మణ గర్జన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ధర్మాన హాజరై మాట్లాడారు. సమాజంలో ఉండే వివిధ కులాల మధ్య అంతరాలు తగ్గాలన్నది తన కోరిక అని అన్నారు. నాయీ బ్రాహ్మణుల విన్నపాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. వైఎస్సార్ సీపీ పాలనలో చిన్న కులాలకు చేయూత ఇచ్చేందుకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేశామని వివరించారు. నాలుగేళ్ల కిందట ఏదైనా పథకం అందాలంటే జన్మభూమి కమిటీలను బతిమలాడాల్సి వచ్చేదని, నేడు ఆ అవస్థ లేదన్నారు. సమస్యల పరిష్కారం కోసం అందరూ ఐక్యంగా ఉండాలని సూచించారు. సమావేశం ప్రొఫెసర్ డాక్టర్ రాళ్ల పేట అరవింద్ అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సంఘం చైర్మన్ సిద్దిపటం యానదయ్య, కళింగ కోమటి కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి అనురాధ, మున్సిపల్ మాజీ మాజీచైర్ పర్సన్ ఎంవీ పద్మావతి, అంబటి శ్రీను, పైడిశెట్టి జయంతి, డాక్టర్ దీర్ఘాసీ విజయ్ భాస్కర్, ఎంబిసి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అమ్మ ఒడి.. భవితకు పెట్టుబడి

- నేడు తల్లుల ఖాతాల్లో 'అమ్మ ఒడి' సొమ్ము జమ
- సచివాలయాల్లో లబ్ధిదారుల జాబితా



సారవకోట: అవలింగి జేబీటీ పాఠశాలలో పూలతో వేసిన అమ్మ ఒడి లోగో

శ్రీకాకుళం న్యూకాలనీ: పేదవాడి చదువు కోసం ప్రభుత్వం సాయం చేస్తోంది. దేశవ్యాప్తంగా బృహత్తర పథకంగా కీర్తి ప్రశంసలు అందుకుంటున్న అమ్మ ఒడి నాల్గో ఏట సొమ్మును బుధవారం ప్రభుత్వం విడుదల చేయనుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి నేరుగా తల్లుల బ్యాంకు ఖాతాల్లో అమ్మఒడి నగదు జమ చేయనున్నారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు బడులు, కళాశాల ల్లో ఒకటి నుంచి ఇంటర్మీడియెట్ వరకూ చదువుతున్న విద్యార్థులకు అమ్మఒడి సాయంగా రూ.15వేలు అందజేస్తున్నారు. అయితే ఈ మొత్తంలో పాఠశాలల టాయిలెట్స్ నిర్వహణ, పరిశుభ్రతకు రూ.2 వేలు మినహాయించి మిగిలిన రూ.13 వేలు విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ చేస్తారు. ఈ నేపథ్యంలో అర్హుల జాబితాలు సచివాలయాల్లో అందుబాటులో ఉన్నాయి.

ముప్పై మండలాలతో కూడిన శ్రీకాకుళం జిల్లాలో గత ఏడాది ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకూ చదువుకున్న విద్యార్థుల్లో 1,95,358 మంది అర్హులు అమ్మ ఒడి ద్వారా రూ.293.37 కోట్లు అందుకున్నారు. ఈ ఏడాది కూడా రిమార్కులు ఉన్న లబ్ధిదారుల జాబితాలు సచివాలయాల పరిధిలో ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసిస్టెంట్లు, వలంటీర్లు నెల రోజుల కిందట వెరిఫికేషన్ చేశారు. దీంతో అర్హుల జాబితా సచివాలయాలకు చేరింది. ఈ ఏడాది సుమారుగా జిల్లాలో 1,91,689 మందికి రూ.287.53 కోట్లు అందించనున్నారు.

విద్యా రంగానికి అండ..

ఏ ఒక్క పేద విద్యార్థి ఆర్థిక భారంతో చదువుకు దూరం కాకూడదనేది సీఎం వైఎస్ జగన్ ఆలోచన. పేదల పిల్లలను బడికి పంపిస్తే ఫీజులు, పుస్తకాలు, నోట్ బుక్స్, స్కూల్ బ్యాగ్, షూ తదితర అవసరాలకు అధిక మొత్తంలో ఖర్చు చేయాల్సి వచ్చేది. కానీ ఇప్పుడు జగనన్న విద్యా కానుక పేరుతో స్కూల్ బ్యాగ్‌తో సహా అన్ని వస్తువులను ప్రభుత్వమే అందజేస్తోంది. ఈ ఏడాది కూడా పాఠశాలల పునఃప్రారంభం రోజు నే జగనన్న విద్యా కానుకలను విద్యార్థులకు ఇచ్చింది. నాణ్యతతోకూడిన రుచికరమైన, పౌష్టికరమైన మధ్యాహ్న భోజనాన్ని కూడా గోరుముద్ద పేరిట అందిస్తున్నారు. మనబడి నాడు–నేడు పేరిట ప్రభుత్వ బడులకు సరికొత్త శోభను తీసుకొచ్చారు.

చదువుకు ఆర్థిక భరోసా..



ప్రభుత్వం ఏటా అమ్మఒడి పథకం కింద ఆర్థిక సాయాన్ని నేరుగా తల్లుల ఖాతాల్లో జమ చేస్తోంది. ఈ ఏడాది సొమ్మును అందజేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంది. అర్హులైన తల్లులు/సంరక్షకుల బ్యాంకు ఖాతాల్లో సీఎం జగన్ నేరుగా బటన్ నొక్కి నగదును జమచేయనున్నారు. అమ్మ ఒడి పథకంతో పేద విద్యార్థులకు, వారి తల్లులకు ఆర్థిక భరోసా లభిస్తుంది.

– డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య, డీఈఓ, శ్రీకాకుళం

నియోజకవర్గాల వర్గాలవారీగా..

నియోజకవర్గం పేరు	అర్హుల సంఖ్య	లబ్ధి (రూ.కోట్లలో)
ఆమదాలవలస	18,076	27.12
ఎచ్చెర్ల	28,907	43.36
శ్రీకాకుళం	25,387	38.08
నరసన్నపేట	21,323	31.98
పాతపట్నం	22,411	33.62
టెక్కలి	24,005	36.54
పలాస	22,392	33.59
ఇచ్ఛాపురం	29,188	43.78

జిల్లాలో అమ్మఒడి పథకం లబ్ధి ఇలా.. (రూ.కోట్లు)

సంవత్సరం	అర్హులైన తల్లులు	జమచేసిన సొమ్ము (రూ.కోట్లలో)
2019–20	2,39,902 (38 మండలాలు)	359.85
2020–21	2,39,692 (38 మండలాలు)	359.54
2021–22	1,95,358 (30 మండలాలు)	293.37
2022–23	1,91,689 (30 మండలాలు)	287.53



అమ్మవారి సేవలో మంత్రి సీదిరి



అంబికామాత అమ్మవారికి హారతి ఇస్తున్న మంత్రి అప్పలరాజు

ఇచ్ఛాపురం రూరల్: బెన్నుగానిపేట గ్రామదేవత మా అంబికా దేవి ఆలయ పునః ప్రతిష్ఠ సందర్భంగా మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు మంగళవారం అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయన వెంట ఎంపీపీ, జెడ్పీటీసీలు బోర పుష్ప, ఉప్పాడ నారాయణమ్మ, పలువురు మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

గ్రామాలపై నిఘా పెట్టాలి : ఎస్పీ



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ రాధిక

టెక్కలి రూరల్: పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో కూడా పోలీసులు తమ నిఘాను పెంచాలని జిల్లా ఎస్పీ జీఆర్ రాధిక అన్నారు. టెక్కలి పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఆమె వార్షిక తనిఖీలు నిర్వహించారు. ముందుగా మహిళా పోలీసులతో మాట్లాడుతూ రానున్నది ఎన్నికల సమయం కావడంతో ప్రతి ఒక్కరూ తమ పరిధిలోని సమాచారం మొత్తం సేకరించి ఉంచాలని, గ్రామీణ ప్రాంతాల్లో గంజాయి, డ్రగ్స్ సేవిస్తున్న వారి సమాచారం సేకరించాలని సూచించారు. అనంతరం టెక్కలి, నరసన్నపేట పరిధిలో గల 9 పోలీస్‌స్టేషన్లలో రౌడీషీట్లు ఉన్న వారిని పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ప్రతి ఒక్క రౌడీ షీటర్‌పై ప్రత్యేక నిఘా ఉందని, ఎలాంటి చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలానే 2010కి ముందు రౌడీషీట్ కట్టిన వారి ప్రవర్తనను బట్టి వారి రౌడీషీట్లను తొలగించవచ్చని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న పాత కేసులు త్వరితగతిన పరిష్కరించాలని కోరారు.

క్లుప్తంగా

చదువుపై దృష్టి సారించాలి



విద్యార్థినులతో మాట్లాడుతున్న డైరెక్టర్ పెద్దాడ జగదీశ్వరరావు

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థులు చదువుపై ప్రత్యేక దృష్టిపెట్టాలని శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ట్రిపుల్ ఐటీ) క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ పెద్దాడ జగదీశ్వరరావు అన్నారు. శ్రీకాకుళం క్యాంపస్‌లో క్లాస్‌వర్కును మంగళవారం పరిశీలించారు. ప్రీ యూనివర్సిటీ కోర్సు, ఇంజినీరింగ్ క్లాస్‌లు పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. వసతి గృహం నిర్వహణ, భోజన నాణ్యత వంటివి అడిగి తెల్సుకున్నారు. ఎటువంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రతి విద్యార్థి లక్ష్యం నిర్దేశించుకుని ముందుకుసాగాలన్నారు. అకడమిక్ క్యాలెండర్ మేరకు తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

సజావుగా సీఆర్టీల బదిలీల కౌన్సెలింగ్



సీఆర్టీలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

సీతంపేట: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న సీఆర్టీ (కాంట్రాక్ట్ రెసిడెంట్ టీచర్)ల బదిలీల కౌన్సెలింగ్ ఐటీడీఏలో పీఓ కల్పనాకుమారి సమక్షంలో మంగళవారం జరిగింది. పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లా పరిధిలో మొత్తం 120 మందికి బదిలీలు చేశారు. వీరిలో స్కూల్ అసిస్టెంట్లు గణితం -28 మంది, పీఎస్-16, బీఎస్-24, సోషల్-14, ఎస్ఏ తెలుగు-7, హిందీ-6, ఇంగ్లిష్-18, పీడీలు ఏడుగురు ఉన్నారు. కార్యక్రమంలో ఏపీఓ రోసిరెడ్డి, గిరిజన సంక్షేమ శాఖ డీడీ శ్రీనివాసరావు, డిప్యూటీ ఈఓ ఎ.లిల్లీ రాణి, ఏటీడబ్ల్యూఓ కృష్ణవేణి, ఏఎంఓ కోటిబాబు, హెచ్ఎంలు కె.సుబ్బారావు, చంద్రరావు, నారాయుడు, సూర్యం, ఉమావాణి, తదితరులు పాల్గొన్నారు.

స్పిన్నింగ్ మిల్లు నిర్వహణకు సహకరించండి



మాట్లాడుతున్న మంచు కృష్ణారావు

నరసన్నపేట: శాలివాహనా స్పిన్నింగ్ మిల్లు జిల్లాకు చెందిన చేనేత కార్మికుల కల అని, దీనిని నెరవేర్చేందుకు చేస్తున్న కృషికి అందరూ సహకరించాలని స్పిన్నింగ్ మిల్ బోర్డు చైర్మన్ మంచు కృష్ణారావు కోరారు. మంగళవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ మిల్లు నిర్వహణకు కొత్తగా మిషన్లు కొనుగోలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం అంత డబ్బు లేని కారణంగా స్పిన్నింగ్ మిల్లు బోర్డు పరిధిలోని 21 ఎకరాల్లో 4 ఎకరాలు అమ్మకానికి ప్రతిపాదించామన్నారు. 40 ఏళ్ల కిందట స్పిన్నింగ్ మిల్ నిర్మాణం కోసం పొట్నూరు వంశీకులు అప్పట్లో 26 ఎకరాల 89 సెంట్లు దానం చేశారని గుర్తు చేశారు. దీంట్లో కొంత స్థలంలో మహిళా రెసిడెన్సియల్ కళాశాలను ప్రభుత్వం నిర్మించిందని, మరి కొంత స్థలంలో రోడ్డు నిర్మాణం జరిగిందన్నారు. మిగిలిన ఈ భూములపై సర్వ హక్కులు స్పిన్నింగ్ మిల్ బోర్డుకే ఉన్నాయని స్పష్టం చేశారు. కౌలు రైతులకు ఎటువంటి సంబంధం లేదన్నారు. జిల్లాలో చేనేత కార్మికులు అభివృద్ధి చెందాలంటే ఇక్కడ స్పిన్నింగ్ మిల్ నిర్వహణ చేయాలని, దీనికి కొత్త మిషన్లు కొనుగోలు అవసరమన్నారు. అందరూ మిల్లు నిర్వహణకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	59,180-00
బంగారం(22సి. 10గ్రా.)	54,350-00
వెండి (కిలో)	75,700-00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 550.00
విజయనగరం	రూ. 554.00
శ్రీకాకుళం	రూ. 554.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹135	₹240	₹ 250

విద్యుత్ స్టోర్స్‌లో ఇంటిదొంగలు!

- పొందూరుకు అక్రమంగా తరలివెళ్లిన 10 ఇనుప ఛానల్స్
- ఫిర్యాదుతో రంగంలోకి దిగిన విజిలెన్స్ అధికారులు
- ఔట్ డోర్ ఏఈ రమాదేవిపై సస్పెన్షన్ వేటు



విద్యుత్ శాఖ జిల్లా స్టోర్స్ ఇదే...

అరసవల్లి : విద్యుత్ శాఖ జిల్లా స్టోర్స్‌లో విలువైన సామగ్రి బయటకు తరలిపోయింది. విషయం బయటకు రావడంతో విద్యుత్ విజిలెన్స్ అధికారులు రెండు రోజులుగా విచారణ చేపట్టారు. విద్యుత్ సర్కిల్ ఎస్ఈ ఆధ్వర్యంలో ప్రత్యేక విచారణ కమిటీ చేపట్టిన దర్యాప్తులో అక్రమంగా 10 ఐరన్ ఛానల్స్ తరలించినట్లుగా నిర్ధారణ కావడంతో జిల్లా స్టోర్స్‌లో ఔట్ డోర్ ఏఈగా పనిచేస్తున్న బి.రమాదేవిపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ ఘటన విద్యుత్ శాఖలో తీవ్ర చర్చనీయాంశమైంది.వివరాల్లోకి వెళితే.. నాలుగైదు రోజుల క్రితం శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల రోడ్డులో ఉన్న విద్యుత్ శాఖ జిల్లా స్టోర్స్‌లో కొన్ని ఇనుప వస్తువులు, విద్యుత్ సామగ్రి అక్రమంగా బయటకు వెళ్లిపోయాయనే ఫిర్యాదుతో విజిలెన్స్ అధికారులు విచారణ మొదలుపెట్టారు. అక్కడే పనిచేస్తున్న కొందరు అధికారుల చేతివాటంతోనే ఈ అక్రమం జరిగిందని దాదాపుగా నిర్ధారణకు వచ్చారు. వివిధ మండలాలకు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు గాను పలు రకాల సామగ్రిని ప్రభుత్వ వాహనాల ద్వారా తరలించే ప్రక్రియలో భాగంగా అక్రమంగా కొన్ని ఇనుప ఛానల్స్‌ను వాహనాల్లో ఎక్కించి పొందూరు మండలంలో ఓ ప్రాంతానికి తరలించినట్లుగా గుర్తించారు. అనంతరం పొందూరు మండలంలో అక్రమంగా దాచి ఉంచిన ఇనుప వస్తువులను గుర్తించిన విజిలెన్స్ అధికారులు జిల్లా స్టోర్స్ నుంచి ఎలా బయటకు వచ్చాయనే కోణంలో విచారణ కొనసాగించారు. విద్యుత్ సర్కిల్ ఎస్ఈ దైవప్రసాద్ కూడా తీవ్రంగానే స్పందించి ఈ వ్యవహారంపై రెండ్రోజుల క్రితమే విచారణకు ప్రత్యేక కమిటీని నియమించారు. అటు విజిలెన్స్..ఇటు విద్యుత్ శాఖ సర్కిల్ అధికారులు కూడా దాదాపుగా ప్రాథమికంగా నిర్ధారణ దిశగా నివేదికలను తయారు చేయగా.. ఎస్ఈ తక్షణ చర్యల్లో భాగంగా ఔట్ డోర్ ఏఈ రమాదేవిని విధుల నుంచి సస్పెండ్ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

పొందూరులో కదిలిన డొంక:

ఆర్ట్స్ కళాశాల రోడ్డులో ఉండే విద్యుత్ శాఖ స్టోర్స్‌లో గతంలో కూడా ఇలాంటి అక్రమ తరలింపులు జరిగాయి. వీటిపై అప్పట్లో 'సాక్షి'లో పలు కథనాలు ప్రచురితమయ్యాయి. తాజాగా ఇదే స్టోర్స్‌లో సామగ్రిని పొందూరుకు అక్రమ తరలింపు వ్యవహారం హాట్ టాపిక్‌గా మారింది. నాలుగైదు రోజుల క్రితమే ఈ వ్యవహారం జరిగినప్పటికీ.. ఇందులో పాత్ర ఉన్న అధికారుల మధ్య బేధాభిప్రాయాలు రావడంతో వీరిలో ఒకరు విజిలెన్స్‌కు తెలిసేలా చేసినట్లు భోగట్టా. దీంతో విజిలెన్స్ అధికారుల తనిఖీలతో ఒక్కసారిగా కథ అడ్డం తిరిగింది. ఇటు స్టోర్స్ ఇన్‌చార్జి, ఇన్‌డోర్ ఏఈ, ఔట్ డోర్ ఏఈతో పాటు అక్రమంగా డంప్ చేయబడిన పొందూరు సెక్షన్ పరిధి ఏఈ తదితర ఉద్యోగులందరి పాత్రలపై విజిలెన్స్ నిఘా ఉంచింది. ప్రస్తుతానికి ఔట్ డోర్ ఏఈ రమాదేవిపై వేటు పడినప్పటికీ.. ఇది ప్రాథమిక చర్యగానే అధికారులు స్పష్టం చేస్తున్నారు. మిగిలిన అధికారుల నిర్లక్ష్యంపైనా చర్యలకు దిగనున్నట్లు సమాచారం.

సస్పెండ్ చేశాం..



స్టోర్స్‌లో 10 వరకు ఇనుప ఛానల్స్‌ను అక్రమంగా పొందూరుకు తరలించిన వ్యవహారంలో ప్రాథమిక విచారణ ఆధారంగా ఔట్ డోర్ ఏఈ రమాదేవిని విధుల నుంచి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశాం. ఆమె స్థానంలో ఇన్‌డోర్ ఏఈకి ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించనున్నాం. స్టోర్స్‌లో నిర్లక్ష్యంగా పనిచేసిన వారిని గుర్తించడంతో పాటు జిల్లా స్టోర్స్‌లో మరింత నిఘా పెంచేలా చర్యలు చేపడతాం.

– ఎల్.దైవప్రసాద్, ఎస్ఈ

సీవీఓకు నివేదిక..



జిల్లా స్టోర్స్ నుంచి అక్రమంగా విద్యుత్ సామగ్రి తరలించారన్న సమాచారంతో ముందుగా పొందూరులో 10 ఇనుప ఛానల్స్‌తో పాటు విద్యుత్ కేబుల్స్‌ను గుర్తించాం. అక్కడి నుంచే విచారణ కొనసాగించాం. బాధ్యులను గుర్తించాం. నివేదికను సిద్ధం చేసి చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ ప్రసన్నకుమార్‌కు అందజేయనున్నాం.

– ఎం.వెంకట నారాయణ, సీఐ విజిలెన్స్

న్యాయవాదులకు ప్రోత్సాహం అభినందనీయం



మాట్లాడుతున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్ని సూర్యారావు

శ్రీకాకుళం పాతబస్టాండ్:

గతంలో ఏ ప్రభుత్వం 'లా నేస్తం' వంటి పథకం అమలు చేయలేదని, ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం న్యాయవాదులకు ఎంతగానో ప్రోత్సహిస్తోందని శ్రీకాకుళం బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ ఎన్ని సూర్యారావు, పొన్నాడ రాము, బీసీ న్యాయవాదుల సంఘం ప్రతినిధులు ఆగూరి ఉమామహేశ్వరరావు, చౌదరి లక్ష్మణరావు, వైఎస్ఆర్ లీగల్ సెల్ న్యాయవాది డి.గణేష్ అన్నారు. లా నేస్తం పథకం అమలు నేపథ్యంలో మంగళవారం బార్ అసోసియేషన్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు పొన్నాడ వెంకటరమణ, కూన అన్నంనాయుడు, మురళీమోహన్‌రావు, ఆపీస్‌నాయుడు, మామిడి క్రాంతి, అన్నెపు సత్యనారాయణ, తంగి శివప్రసాద్, ఖగేశ్వరరావు, బి.వి.రమణ, పి.దామోదర్‌రావు, హరిప్రియ తదితరులు ప్రసంగించారు. యువ న్యాయవాదులకు లా నేస్తం కింద అందిస్తున్న స్టయిఫండ్ ఎంతగానో ఆర్థిక భరోసా ఇస్తోందన్నారు. దేశంలో ఎక్కడా యువ న్యాయవాదులను ప్రోత్సహిస్తూ ఇటువంటి పథకం లేదని కొనియాడారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి పథకం ద్వారా నగదు విడుదల చేయడం అభినందనీయమన్నారు. జిల్లాలో అర్హులైన 51 మంది జూనియర్ న్యాయవాదుల ఖాతాల్లో నెలకు రూ 5వేలు చొప్పున మొత్తం 51 మంది అర్హులకు రూ.12.50 లక్షలు జమ చేయడం గొప్పవిషయమన్నారు. న్యాయవ్యవస్థ, న్యాయవాదులపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఉన్న గౌరవాన్ని ఈ రూపంలో తెలియజేస్తున్నారని పేర్కొన్నారు.

విద్యార్థుల ఔదార్యం.. పాఠశాలకు విరాళం



నగదు ప్రోత్సాహకాన్ని విరాళంగా అందజేస్తున్న దృశ్యం

సంతబొమ్మాళి: విద్యార్థులు తమకు అందిన నగదు ప్రోత్సాహం మొత్తాన్ని పాఠశాలకు విరాళంగా అందజేసిన ఘనత సంతబొమ్మాళి మండలం దండుగోపాలపురం విద్యార్థులకు దక్కింది. గత విద్యా సంవత్సరం(2022-23)లో 10వ తరగతిలో 574 మార్కులు సాధించిన కానూరు సాధనప్రియకు రూ.3వేలు, 573 మార్కులు సాధించిన కింజరాపు కావ్యశ్రీకు రూ.2వేలు, 562 మార్కులు సాధించిన కొన్న చాందినికు రూ.వెయ్యి నగదు ప్రోత్సాహకాలను ప్రభుత్వం ఇటీవల అందజేసింది. ఆ నగదును పాఠశాల అభివృద్ధికి వినియోగించాల్సిందిగా ముగ్గురు విద్యార్థులు మంగళవారం హెచ్ఎంకు విరాళంగా అందజేశారు. వీరిని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భాస్కరరావు, వీరభద్రరావు, లక్ష్మీకాంతం, ఆదికేశవరెడ్డి, తిరుపతిరావు, లక్ష్మి, నాగేశ్వరరావు, పార్వతి, ఉమ, రాము, చిన్నారావు, మురళీధరరాజు, విజయలక్ష్మి, రవికుమార్, కృష్ణవేణి, మార్కండేయులు, సీఆర్‌పీ గిరి, రోజా, దయాసాగర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో సచివాలయ లైన్‌మేన్ మృతి



ఎర్రయ్య(ఫైల్)

జి.సిగడాం: మండలంలోని వెలగాడ సచివాలయంలో విద్యుత్ లైన్‌మేన్‌గా విధులు నిర్వహిస్తున్న ఎ.ఎర్రయ్య (33) మంగళవారం విద్యుత్ షాక్‌తో మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. విధి నిర్వహణలో భాగంగా ఎర్రయ్య మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో వెలగాడలో ఎల్‌సీ తీసుకుని స్తంభం ఎక్కి విధులు నిర్వహిస్తుండగా పక్కనే ఉన్న హెవీలైన్ తగలడంతో విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. అక్కడి నుంచి కిందకు పడిపోయాడు. స్థానికులు స్పందించి 108 వాహనంలో శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. తలకు, గుండెకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స పొందుతూ సాయంత్రం 4 గంటల సమయంలో మృతి చెందాడు. ఎర్రయ్యకు భార్య లక్ష్మి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

పేద కుటుంబాన్ని ఆదుకోవాలి..

నిరుపేద కుటుంబానికి చెందిన ఎర్రయ్య పుట్టినప్పటి నుంచి ఎన్నో ఇబ్బందులు పడ్డాడు. కష్టపడి చదివి సచివాలయం ఉద్యోగం సాధించాడు. భార్య, ఇద్దరు ఆడ పిల్లలతో ఆనందంగా జీవిస్తున్న తరుణంలో మృత్యువు వెంటాడింది. ఎర్రయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. విషయం తెలుసుకున్న ఏఈఈ తిరుపతిరావు, పంచాయతీ కార్యదర్శి చేబ్రోలు సురేష్, తోటి ఉద్యోగులు ఎర్రయ్య కుటుంబాన్ని ఓదార్చారు. కాగా, ఎర్రయ్య మృతి వార్త తెలియగానే స్వగ్రామం మధుపాంలో విషాదఛాయలు అలముకున్నాయి. ఎర్రయ్య మృతిపట్ల సర్పంచ్ బగాది అప్పలనాయుడు, మాజీ సర్పంచ్ నల్లి తవిటినాయుడు, ముగ్గు శ్రీనివాసరావు సంతాపం వ్యక్తం చేశారు.

చిరుధాన్యాల సాగుకు ప్రోత్సాహం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ

విజయనగరం అర్బన్: రాష్ట్ర ప్రజల ఆరోగ్యం దృష్ట్యా చిరుధాన్యాల వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నామని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, పౌర సరఫరాలశాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు స్పష్టంచేశారు. దీనిలో భాగంగానే రేషన్‌డిపోల ద్వారా రాగులు, జొన్నలు పంపిణీ చేయాలని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయించారని చెప్పారు. చిరుధాన్యాల సాగు, ధాన్యం సేకరణపై ఉత్తరాంధ్ర జిల్లాల జాయింట్ కలెక్టర్లు, పౌర సరఫరాలు, విజిలెన్స్, తూనికలు కొలతలు, వ్యవసాయ శాఖాధికారులతో కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ముందుగా రాష్ట్ర పౌర సరఫరాల కమిషనర్ హనుమంతు అరుణ్‌కుమార్, పౌర సరఫరాల సంస్థ ఎండీ వీరపాండ్యన్ మాట్లాడుతూ చిరుధాన్యాల సాగును ప్రోత్సహించాల్సిన అవసరాన్ని వివరించారు. తమ జిల్లాల్లో చిరుధాన్యాలలో ప్రధానంగా రాగిపంట సాగు, దాని విస్తరణకు ఉన్న అవకాశాలను జాయింట్ కలెక్టర్లు పీపీటీ ద్వారా వివరించారు. ప్రభుత్వం రాగులకు క్వింటాకు రూ.3,480 చొప్పున గిట్టుబాటు ధర కల్పిస్తోందని, రైతులు సద్వినియోగం చేసుకొని, రాగుల సాగు విస్తీర్ణం పెంచాలని కోరారు. జూలై నుంచి రాష్ట్రంలోని అన్ని పట్టణ ప్రాంతాల్లో కిలో రూ.16 చొప్పున ఫోర్టిఫైడ్ గోధుమ పిండిని రేషన్ డిపోల ద్వారా పంపిణీ చేస్తామని మంత్రి కారుమూరి వెల్లడించారు. ధాన్యం కొనుగోలు వ్యవస్థను పూర్తి పారదర్శకంగా నిర్వహిస్తున్నామని, గత సీజన్‌లో 98 శాతం మందికి డబ్బులు జమచేశామని చెప్పారు. ప్రస్తుతం కందిపప్పు లభ్యత అంతగా లేదని, ఆగస్టు నుంచి దీనిని సరఫరా చేస్తామని మంత్రి ప్రకటించారు. అనంతరం గోధుమ పిండి పంపిణీ ప్యాకెట్లను మంత్రులిద్దరూ లాంఛనంగా ప్రారంభించారు. సమావేశంలో విజయనగరం జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ కె.మయూర్ అశోక్, శ్రీకాకుళం జేసీ నవీన్‌కుమార్, అనకాపల్లి జేసీ జాన్వీ, ఆరు జిల్లాల పౌర సరఫరాల అధికారులు, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్లు, విజిలెన్స్, తూనికలు, వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సేవలు అందరికీ అందాలి



బొర్రంపేటలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి వాసుదేవరావు

ఎల్.ఎన్.పేట: ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు అన్ని రకాల ప్రభుత్వ సేవలు అందరికీ అందాలని గ్రామ సచివాలయాల పరిపాలన జిల్లా పర్యవేక్షణ అధికారి (జిల్లా నోడల్ అధికారి) పడాల వాసుదేవరావు అన్నారు. ఎల్.ఎన్.పేట మండలం బొర్రంపేట, బొత్తాడసింగి గ్రామాల్లో మంగళవారం జగనన్న సురక్ష సర్వే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 732 గ్రామ సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా 11 రకాల సేవలను ప్రజలకు ఉచితంగా అందజేస్తామన్నారు. వీటిపై గ్రామ వలంటీర్ల ద్వారా అవగాహన కలిగిస్తున్నట్లు తెలిపారు. కుల, ఆదాయ, నివాస, మరణ, జనన, కుటుంబ సభ్యుల ధ్రువపత్రాలతో పాటు ఆధార్ నెంబర్‌కు ఫోన్ నంబర్ లింక్ వంటి 11 రకాల సేవలు ఉచితంగా పొందవచ్చన్నారు. వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి అవసరమైన ధ్రువపత్రాలు తీసుకుని వారికి టోకెన్ ఇవ్వాలన్నారు. ఇలా చేయటం వల్ల సంబంధిత గ్రామ సచివాలయంలో ప్రత్యేక శిబిరం నిర్వహించి పత్రాలు మంజూరు చేస్తామని తెలిపారు. ఆయనతో పాటు ఎంపీడీఓ ఆర్.కాళీప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు జయమోహన్ పాడి, విష్ణు, భారతి తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ, బీఈడీ నాలుగేళ్లలోనే..

- సమీకృత ఉపాధ్యాయ డిగ్రీ కోర్సులో ప్రవేశాలకు ఆహ్వానం
- బీఏ ఎడ్యుకేషన్‌లో 50 సీట్లు, బీఎస్సీ ఎడ్యుకేషన్‌లో 50 సీట్లు
- ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం: వీసీ



వివరాలు వెల్లడిస్తున్న వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు

ఎచ్చెర్ల క్యాంపస్: ఈ ఏడాది నుంచి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో ప్రారంభిస్తున్న నాలుగేళ్ల సమీకృత ఉపాధ్యాయ విద్యా డిగ్రీ కోర్సును విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు కోరారు. వర్సిటీలో మంగళవారం వివరాలు వెల్లడించారు. జాతీయ స్థాయిలో 42 విద్యాసంస్థలకు జాతీయ ఉపాధ్యాయ విద్యా మండలి ఈ కోర్సు మంజూరు చేసిందన్నారు. ఏపీలో రెండు విద్యా సంస్థలకు గాను అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ఒకటని పేర్కొన్నారు. ఈ ఏడాది బీఏ ఎడ్యుకేషన్ (హిస్టరీ, ఎకనామిక్స్, పాలిటిక్స్)లో 50 సీట్లు, బీఎస్సీ ఎడ్యుకేషన్ (గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ)లో 50 సీట్లతో కోర్సు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. డిగ్రీతో పాటు బీఎడ్ నాలుగేళ్లలో పూర్తవుతుందని చెప్పారు. 2023-24 విద్యా సంవత్సరానికి ప్రవేశాలకు 42 విద్యా సంస్థలకు కలిపి దేశవ్యాప్తంగా 178 నగరాల్లో, 13 భాషల్లో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తుందని వివరించారు. ఈ నెల 26న దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైందని, జూలై 19న చివరి తేదీ అని చెప్పారు. ఇంటర్మీడియట్ పూర్తిచేసిన విద్యార్థులు అర్హులని తెలిపారు. ఆన్‌లైన్ పద్ధతిలో కంప్యూటర్ బేస్డ్ విధానంలో పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎన్‌టీఏ.ఏసీ.ఇన్, ఎన్‌సీఈటీ.సమ్రత్.ఏసీ.ఇన్ వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చని తెలిపారు. నూతన విద్యావిధానంలో భాగంగా ఈ కోర్సులను డిజైన్ చేశారని, ప్రమాణాలతో కూడిన ఉపాధ్యాయ విద్య అందుతుందని వివరించారు. అమెరికా, కెనడా, న్యూజిలాండ్ వంటి దేశాల్లో అధ్యయనం చేసి ఈ కోర్సు అమల్లోకి తెస్తున్నట్లు వివరించారు. డిగ్రీ మూడేళ్లు, బీఎడ్ రెండేళ్లు చదవాల్సిన అవసరం లేకుండా కేవలం నాలుగేళ్లలోనే మొత్తం కోర్సు పూర్తవుతుందని వివరించారు. విజయవంతంగా కోర్సు పూర్తిచేసిన విద్యార్థులు ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు అర్హత సాధిస్తారని తెలిపారు. 160 మార్కులకు ప్రవేశ పరీక్ష ఉంటుందని చెప్పారు.

రుణాల మంజూరుకు ముందుకురావాలి



వార్షిక రుణ ప్రణాళిక పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, బ్యాంక్ అధికారులు

శ్రీకాకుళం అర్బన్: జిల్లాలో రైతులకు, మహిళలకు సకాలంలో రుణాలు మంజూరుచేసి ఆర్థిక సాధికారత సాధించేందుకు దోహదపడాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ బ్యాంకు అధికారులను ఆదేశించారు. మంగళవారం శ్రీకాకుళం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో లీడ్ బ్యాంకు ఆధ్వర్యంలో బ్యాంకర్ల జిల్లా స్థాయి సమీక్ష కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఎస్‌ఎంఈలకు విరివిగా రుణాలు మంజూరు చేసి జిల్లా పారిశ్రామికంగా ఎదిగేందుకు కృషిచేయాలని పిలుపునిచ్చారు. జిల్లాలో ఈ ఏడాది రూ.14,400 కోట్ల మేర రుణాలు మంజూరు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు చెప్పారు. ఇందులో రూ.8,597 కోట్లు ప్రాధాన్యతారంగానికి ఉండగా, అందులో రూ.6,780 కోట్లు రైతులకోసం వెచ్చించనున్నట్లు వివరించారు. 2023-24 వార్షిక రుణ ప్రణాళికలో నిర్దేశించిన లక్ష్యాలు వాస్తవానికి దగ్గరగా ఉండాలన్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించినందుకు సంతోషం వ్యక్తం చేస్తూ బ్యాంకు అధికారులను కలెక్టర్ అభినందించారు. ఇదే స్ఫూర్తితో ఈ ఆర్థిక సంవత్సరంలోనూ అధికంగా రుణాలు మంజూరుచేయాలని కోరారు. అనంతరం 2023-24 వార్షిక రుణ ప్రణాళికను అధికారులతో కలిసి ఆవిష్కరించారు. సమావేశంలో ఎల్‌డీఎం ఎం.సూర్యకిరణ్, డీసీసీ కన్వీనర్, యూబీఐ రీజనల్ హెడ్ ఎం.వి.తిలక్, నాబార్డ్ డీడీ ఎం కె.వరప్రసాద్, ఆర్‌బీఐ ఏజీఎం రెహమాన్, యూబీఐ ఆర్‌సెటీ డైరెక్టర్ కె.శ్రీనివాస్, ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ టి.ఆర్.ఎం.రాజు, ఏపీజీవీబీ రీజనల్ మేనేజర్లు శ్రీరాఘవేంద్ర, ఆనందరావు, వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు కె.శ్రీధర్, మెప్మా పథక సంచాలకులు ఎం.కిరణ్‌కుమార్, డీఆర్‌డీఏ, ఇతర బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

వారంలోగా సమస్యలు పరిష్కరించాలి

- సోంపేట ఆదర్శ పాఠశాల సిబ్బందికి కలెక్టర్ ఆదేశం



ఆదర్శ పాఠశాల వద్ద అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

సోంపేట :

సోంపేట ఆదర్శ పాఠశాలలో నెలకొన్న సమస్యలను వారం రోజుల్లో పరిష్కరించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ఆదేశించారు. పాఠశాల సమస్యలపై ఇటీవల సీఎంఓ కార్యాలయానికి పాఠశాల తల్లిదండ్రుల కమిటీ సభ్యులు, అధ్యాపక సిబ్బంది ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కలెక్టర్ మంగళవారం పాఠశాలను పరిశీలించారు. స్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను వెంటనే తొలగించాలని విద్యుత్‌శాఖ ఏఈ జి.రామారావును ఆదేశించారు. రహదారి నిర్మాణానికి ప్లాన్ తీసుకు వస్తే నిధులు మంజూరు చేస్తామని చెప్పారు. మురుగు కాలువ నీటి నిల్వ, వంటషెడ్డు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం రాష్ట్ర స్థాయితో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్, సర్పంచ్ నగిరి ప్రభావతి, ప్రిన్సిపాల్ చిన్నాజి వర్మ తదితరులు పాల్గొన్నారు. అనంతరం బేసి రామచంద్రాపురం సచివాలయాన్ని కలెక్టర్ సందర్శించారు. సచివాలయ భవనాల నిర్మాణాలు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. జగనన్న కాలనీ చదును చేసినా బిల్లులు అందలేదని సర్పంచ్ బుద్దార రోహిణి కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లారు. వెంటనే బిల్లులు చెల్లించాలని హౌసింగ్ సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో జేసీఎస్ కమిటీ కన్వీనర్ బుద్దాన శ్రీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.